క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈ కోత అమలులో ఉంటుందన్నారు. ఐజీహెచ్ఎస్, మధుబన్ కాలనీ, పద్మశాలిపురం, ఆప్కో కాలనీ, రామ్ స్కూల్, శివాజీనగర్, శివాజీనగర్ ఇండస్ట్రియల్స్, జల్‌పల్లి పారిశ్రామికవాడ, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, చర్చి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మతుల కారణంగా ఈ కోత విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

బలగం ఫేమ్ కొమరయ్యకు సన్మానం


సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదాధామంలో బలగం కొమరయ్య ఫేమ్ సుధాకర్‌రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, పాఠశాల అధ్యక్షులు గోకరి అర్జున్‌గౌడ్, కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, ప్రాంత పూర్వ విద్యార్థి అధ్యక్షులు శ్రీరెడ్డి, హనిస్మరన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన ఉన్నతికి శిశు మందిరాలు కారణమని, అనేక సంవత్సరాలుగా శిశు మందిరంలో ఆచార్యుడిగా పని చేశానని, తన విద్యార్థులు ఎందరో నేడు ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ


నిఖత్ జరీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శివకుమార్

మణికొండ: ప్రపంచ మహిళా బాక్సింగ్ చాంపియన్‌గా రెండవ సారి నిలిచిన నిఖత్ జరీన్ శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తన ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను స్థానికులు అభినందనలతో ముంచెత్తారు. మణికొండ బాక్సింగ్ కోచ్ శివకుమార్ ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

ముగిసిన వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు

లంగర్‌హౌస్: ఆధ్యాత్మం రమణీయంగా కొనసాగిన వసంతనవరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీరాముడి మహా పట్టాభిషేకంతో ముగిశాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగమంలోని చారిత్రాత్మక మఠ దేవాలయం జానకి సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి ఆలయంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ఉగాది నుంచి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా సీతారాములు, లక్ష్మణుడికి పంచామృతాలు, నవరసాలు, నవదాన్యాలు, సుంగద ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవగా చక్రస్నానం నిర్వహించారు. పూర్ణకుంభం అనంతరం వేదపండితులు రాజనర్సింహచారి, శ్రీనివాస్‌చారి సమక్షంలో శ్రీరాముడికి మహా పట్టాభిషేకం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు రాజువస్తాద్, లింగారెడ్డి, సాయిటెక్ ముత్యాల శేఖర్‌బాబు, మామిడాకుల కృష్ణ, నర్సింహారెడ్డి, డాక్టర్ శివకుమార్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలను అందరూ పాటించాలి

జియాగూడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని విద్యశ్రీ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలలో ఎక్కువ శాతం మైనర్లే మృతిచెందుతున్నారని, తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వొద్దని సూచించారు. వాహనాలు అతివేగంతో నడపరాదన్నారు. అలాగే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి కూడా వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే వైజ్ఞానిక ప్రదర్శనపట్ల ఆసక్తి చూపడం హర్షణీయమన్నారు. స్కూల్ చైర్మన్ శ్యామ్‌వెరా మాట్లాడుతూ.. విద్యార్థులు చదివిన పాఠ్యాంశాల నుంచే ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. స్కూల్ డైరెక్టర్ సునితా శ్యామ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


క్రిస్టల్ టౌన్‌షిప్‌లో కూల్చివేతలు చేపట్టిన అధికారులు


ఆందోళన చేస్తున్న స్థానికులు

కోర్టు తీర్పుతో క్రిస్టల్ టౌన్‌షిప్‌లో అధికారుల చర్యలు

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను భారీ బందోబస్తు మధ్య రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది శనివారం కూల్చివేశారు. సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జి డీసీపీ కృష్ణమోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ ప్రాంతంలో క్రిస్టల్ టౌన్‌షిప్(ఫ్రైడ్ ఇండియా) పేరిట భారీ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ చేపట్టిన సమయంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. గతంలోనే జీహెచ్ఎంసీ ఈ లేఅవుట్‌కు అనుమతి లేదంటూ ప్రకటన జారీ చేసి నోటీసులు అందించింది. అయినా నిర్వాహకులు పట్టించుకోకుండా నిర్మాణాలు ప్రారంభించడంతో గతంలో ఓ సారి నిర్మాణాలను కూల్చివేశారు. అయినా నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 200 నిర్మాణాలు వెలిశాయి. ఈ నిర్మాణాలన్నిటికి అనుమతులు లేవంటూ జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేసింది. దీంతో కొందరు కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం సైతం జీహెచ్ఎంసీకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం జీహెచ్ఎంసీ సర్కిల్‌ల టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున క్రిస్టల్ టౌన్‌షిప్‌లోకి చేరుకున్నారు. అనంతరం నాలుగు ఇళ్లను పాక్షికంగా కూల్చివేశారు. మరో మూడు ప్రహరీలను నేలమట్టం చేశారు. దీంతో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చి పనులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బాధితులు జీహెచ్ఎంసీకి వ్యతిరేకంగా రోడ్డుపై బైటాయించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.

అధికారికి రూ. లక్షలు ఇచ్చాం

ఇళ్లను నిర్మించే సమయంలో జీహెచ్ఎంసీ అనుమతుల కోసం లక్షలాది రూపాయలు చెల్లించామని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. లే అవుట్‌కు అనుమతి లేదని పర్మిషన్లు ఇవ్వలేదని ఆ సమయంలో వెల్లడించారన్నారు. నిర్మాణాలు చేపట్టేందుకు తమకు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపిస్తున్నారు. తాము ప్రస్తుతం సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారికి రూ. లక్షలు చెల్లించామని ఆరోపించారు. డబ్బులు తీసుకుని కూల్చివేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. జీ ప్లస్ వన్ నుంచి జీ ప్లస్ 6 వరకు నిర్మాణాలకు అంతస్తుల వారీగా డబ్బులు తీసుకున్నారని, సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: విద్యార్థులు చిన్న నాటి నుంచే చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని బ్యాడ్మింటన్ స్టేడియంలో స్టేట్ లెవల్స్ జూనియర్, సీనియర్, మెన్, ఉమెన్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు శనివారం బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఉత్తమ ప్రపతిభకనబరిచిన వారిని అభినందించి సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. చిన్న వయస్సులోనే క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ప్రేమ్‌గౌడ్, రఘుయాదవ్, గుమ్మడికుమార్, జీవన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి


పరీక్ష కిట్‌లు అందుకున్న విద్యార్థులు

మణికొండ: పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉత్సాహంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధన అందించారన్నారు. వంద శాతం ఫలితాలతో మండలంలోనే గత సంవత్సరం మాదిరిగా పాఠశాలను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాఘవేంద్ర, శ్రావణ్ విద్యార్థులకు అవసరమైన పెన్నులు, స్కేల్ తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం,నాయకులు లక్ష్మీశ్రీ, పి.శ్రీనివాస్, ఎ.లక్ష్మణ్‌రావు, సత్యారెడ్డి, ప్రమోద్‌రెడ్డి, కుమార్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, భరత్‌రెడ్డి, దిలిప్ , విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభించిన వాసవీ క్లబ్ కపుల్స్ సభ్యులు

మణికొండ: వేసవి కాలంలో బాటసారులతో పాటు అడ్డా వద్దకు వచ్చే కూలీల దాహార్తిని తీర్చేందుకు మణికొండ క్వార్టర్స్ బస్‌స్టాప్ వద్ద శనివారం వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇతరులకు మంచి చేసినప్పుడే ఆత్మసంతృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ నవీన్, మణికొండ అధ్యక్షురాలు నిరీష, కార్యదర్శి వంశీ, కోశాధికారి రామ్ సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణ భారత్ ట్రస్టులో ఉచిత వైద్య శిబిరం

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో యశోద ఆస్పత్రి, ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గుండె, ఎముకలు, స్త్రీ సంబంధిత, సాధారణ వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు చేయనున్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, టూడీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి


నార్సింగి ఏసీపీని కలిసిన ముస్లింలు

మణికొండ: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండగను ప్రశాంతంగా జరుపుకుని శాంతి భద్రతలకు సహకరించాలని నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ అన్నారు. శనివారం రాత్రి గండిపేట మండలం ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ముక్తార్ పాపా ఆధ్వర్యంలో ముస్లింలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా కొనసాగుతున్న ప్రార్థనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఏసీపీని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



మణికొండ: గుండెపోటు సమస్యలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరికి సీపీఆర్ పై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట గ్రామంలోని రెడ్డి సంఘం భవనంలో కాంటినెంటల్ ఆసుపత్రి వైద్య నిపుణులు సీపీఆర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండెపోట్లు వస్తున్నాయని, అలాంటి వాటిని తట్టుకునేలా శారీరక వ్యాయామం చేయటం, మంచి పౌష్టికాహారం సరిపడినంత మాత్రమే తీసుకోవటం, సీపీఆర్ పద్ధతులను తెలుసుకుని ఉండాలన్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ విజయ్‌బాబు, కౌన్సిలర్ దుర్గేష్‌యాదవ్, డాక్టర్ అరుణ్, ఆసుపత్రి ప్రతినిధి విజయ్, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


హుడా కాలనీలో మొక్కలు నాటుతున్న వనం శ్రీరామ్‌రెడ్డి, కాలనీ వాసులు

రాజేంద్రనగర్: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను సైతం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వనం శ్రీరామ్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శనివారం హుడాకాలనీలో స్వచ్ఛ భారత్, హరితహారం కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తచెదారాలు, వ్యర్థాలను జీహెచ్ఎంసీ కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. కాలనీలో రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటారు. అనంతరం వనం శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత కాలనీ వాసులపై ఉందన్నారు. తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలంతా అవగాహన పెంచుకుని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, భరత్, రూపా, మాలతీ, కిరణ్మయి, జ్యోత్స్న, రాధిక తదితరులు పాల్గొన్నారు.

జలమండలి విజిలెన్స్ సర్వే


మణికొండ జలమండలి కార్యాలయం

మణికొండ: మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి కొందరు ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా నీటిని వాడుకుంటున్నట్లు ఫిర్యాదులు అందడంతో జలమండలి ఉన్నతాధికారులు విజిలెన్స్ సర్వే చేపట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాలు గతంలో పంచాయతీలుగా కొనసాగయి. అప్పట్లో ఇంటి పన్నులతో పాటు నీటి బిల్లులను గ్రామపంచాయతీ వసూలు చేసేది. మున్సిపాలిటీ ఏర్పాటు అనంతరం హైదరాబాద్ శివారు మున్సిపాలిటీల పరిధిలోని నీటి సరఫరా విధులను జలమండలికి అప్పగించారు. దీంతో పాత గ్రామపంచాయతీల నుంచి నీటి కనెక్షన్ల రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇంటింటికి క్యాన్ సర్వే నిర్వహించారు. దీంతో ప్రతి ఇంటికి క్యాన్ నెంబర్‌తో పాటు బిల్లులు జారీ చేయాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా కొన్ని గృహాలకు ఇష్టారాజ్యంగా బిల్లులు జారీ చేయటం, మరికొన్ని గృహాలకు ఇప్పటి వరకు బిల్లులు రాని పరిస్థితి ఉంది. ఒకేసారి రూ. వేలల్లో బిల్లులు వస్తే చెల్లించలేమని, ఇతరులతో పాటు తమకూ నెల వారీ బిల్లులు పంపాలని పలువురు జలమండలి అధికారులను కోరినా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. తీరా ఇప్పుడు సర్వే చేపట్టిన విజిలెన్స్ అధికారులు ఇంటిటికి తిరుగుతూ క్యాన్ నెంబర్, నెల వారి బిల్లులు, పాత నీటి బిల్లుల చెల్లింపులపై ఆధారాలు చూపాలని కోరుతున్నారు. దాంతో స్థానికులు తమకు అడిగిన వెంటనే బిల్లులు ఇవ్వకపోవటంతో అధికారులదే తప్పని, ఇపుడు విజిలెన్స్ అధికారులు జరిమానాలు విధించినా, ఏక మొత్తంలో బిల్లులు మంజూరు చేసినా చెల్లించే పరిస్థితిలో లేమని పేర్కొన్నారు. కాగా జలమండలి అధికారులు మాత్రం గతంలో గ్రామపంచాయతీకి చెల్లించిన నీటి బిల్లుల రసీదులు తెచ్చి ఇస్తే క్యాన్ నెంబర్‌లు జారీ చేస్తామని సెలవిస్తున్నారు.

ప్రతి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా


మేయర్ మహేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్, శివసాయినగర్ కాలనీ వాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. శివసాయినగర్‌లో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీహాల్ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయించాలని కోరుతూ కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్, శివసాయి కాలనీ వాసులు శనివారం మేయర్ మహేందర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరేళ్లుగా కమ్యూనిటీహాల్ నిరుపయోగంగా వదిలి వేశారన్నారు. దీంతో పండుగలు, స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలకు ఇబ్బందిగా ఉందన్నారు. కమిటి హాల్ పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకు రావాలని మేయర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివసాయినగర్ కాలనీ ప్రెసిడెంట్ వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రావణ్‌కుమార్, అల్లం శ్రీనివాస్, రాజేష్, కిరణ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు దారి తీసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్టు


గాయపడ్డ యువకులు


సీసీ కెమెరాలో రికార్డు అయిన దాడి దృశ్యాలు


రాజేంద్రనగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ బాలుడు ఫొటో షేర్ చేయడంతో మరో బాలుడు చేసిన కామెంట్ కాస్తా పరస్పర దాడుల వరకు దారి తీసింది. ఈ ఘటనలో నలుగురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 12 మందిపై కేసు నమోదు చేసినట్లు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన మైనర్ బాలుడు ఇన్‌స్టాగ్రామ్‌లో శుక్రవారం ఉదయం ఓ ఫొటోను షేర్ చేశాడు. ఈ ఫోటో చూసిన బృందావన్ కాలనీకి చెందిన మరో మైనర్ బాలుడు కామెంట్ చేశాడు. ఈ విషయమై బృందావన్ కాలనీకి చేరుకున్న బాబుల్‌రెడ్డినగర్ బాలుడు అతడిని నిలదీశాడు. ఇద్దరి మధ్య గొడవ జరుగుతుండడంతో అక్కడే ఉన్న రావుల భాస్కర్ వారిని మందలించి అక్కడి నుంచి పంపించాడు. ఈ విషయాన్ని బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన బాలుడు ఫోన్‌లో తన సోదరులు, స్నేహితులకు చెప్పడంతో అక్కడికి వచ్చిన వారు రావుల భాస్కర్‌తో పాటు అతడి సోదరుడు రాజు, విక్రాంత్, విశాల్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో రావుల భాస్కర్, విక్రాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపండి


ఆర్‌డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: వట్టినాగులపల్లి, గొలిదొడ్డి, ఖానాపూర్, కోకాపేట గ్రామాల్లో గతంలో ఇచ్చిన హామీల మేరకు ఇళ్ల స్థలాలు చూపించకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే పరిస్థితి లేదని నార్సింగి మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో అధికారులకు మొర పెట్టుకున్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 60 గజాల ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపిస్తామని, వట్టినాగులపల్లిలో దళితుల భూములు సేకరించి విప్రో సంస్థకు కేటాయించారని, వారికి న్యాయం చేస్తామని పలు మార్లు హామీలు ఇచ్చినా నెరవేర్చకపోవటంతో వారు తీవ్రంగా విమర్శిస్తున్నారని నాయకులు ఎమ్మెల్యేతో వాపోయారు. ఈ విషయాన్ని ఆయన రాజేంద్రనగర్ ఆర్‌డీఓ చంద్రకళ, గండిపేట తహశీల్దార్ ఎ.రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేయాలని సూచించారు. ఖానాపూర్ వాసులకు భూమి లభ్యత లేకపోతే శంకర్‌పల్లి మండలం, జన్వాడలో కేటాయించాలని కోరారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖ యాదగిరి, కమిషనర్ సి.సత్యబాబు, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహా, వట్టినాగులపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.నగేష్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చెరువు పరిరక్షణకు చర్యలు


కూల్చివేత పనులను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ తహశీల్దార్ చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలోని ఊర చెరువు కబ్జాపై రాజేంద్రనగర్ 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'తీరు మార్చుకోరా' వార్తపై అధికారులు స్పందించారు. శనివారం ఉదయం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సహాయంతో నాలుగు ప్రహరీలను కూల్చి వేశారు. ఈ సందర్భంగా యజమానులు పట్టా స్థలంలో నిర్మించిన నిర్మాణాలను కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఊర చెరువు ఎఫ్‌టీఎల్‌ను గతంలోనే ఇరిగేషన్ అధికారులతో కలిసి నిర్ధారించినట్లు తెలిపారు. గతంలో నిర్మాణాలను కూల్చివేశామని ప్రస్తుతం 'సాక్షి'లో వచ్చిన కథనంతో ఆర్ఐ సారిక ఆధ్వర్యంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. చెరువు స్థలంలోనే నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించి కూల్చి వేశామన్నారు.

పట్టా స్థలం...

ఊరచెరువు పక్కనే తమకు పట్టా స్థలం ఉందని దానిలోనే నిర్మాణాలు ప్రారంభించినట్లు పట్టాదారులు వెల్లడించారు. కూల్చివేతల విషయం తెలుసుకున్న పట్టాదారులు సంఘటనా స్థలానికి చేరుకుని తహశీల్దార్‌కు పత్రాలు చూపించారు. కొందరు ఫిర్యాదు చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పట్టా స్థలాన్ని గతంలోనే నిర్ధారించారని అందులోనే నిర్మాణాలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.